

చెహోవ్ కథ

# ప్రాణభయం




**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

నాటకం మధ్యలో వేషం మార్చుకోవటానికి హీరోయిన్ డ్రెస్సింగ్ రూంలోకి వచ్చింది. జనం చప్పట్లు, వన్స్‌మోర్‌లతో హీరోయిన్ వుషారుగా వుంది. ప్రేక్షకులను రంజింప చెయ్యటానికి ఏమైనా చెయ్యాలి. కళామతల్లి సేవకే జీవితం అంకితం.

ఆహార్యం మొత్తం విప్పేసి, ఈవ్ వేసుకునే డ్రెస్సులో అద్దం ముందు నిలబడి కొత్త దుస్తుల కోసం వెదుకుతున్నప్పుడు గదిలో మనిషి అలికిడి వినిపించింది. ఎవరూ వినరాలేదు. మళ్లీ ఊపిరి తీసుకున్న చప్పుడు. కబర్డులో, కర్టెన్ల వెనకా వెదికింది. ఎవరూ లేరు. ఇంకెక్కడ నక్కుంటారు? ఉన్నదొక్క సోఫా. కిందికి చూస్తే ముడుచుకుపడుకున్న మనిషి.

"ఎవరూ?" అంటూ గావు కేకపెట్టింది.

"నేనే. నేనే. భయపడకు. అరవకు ప్లీజ్."

గొంతు గుర్తుపట్టగలదు. వాడు స్టేజి మేనేజర్. ఇండియూకోవ్. "ఛీ. నువ్వా. ఎంత ధైర్యం నీకు. అప్పట్నుంచీ యిక్కడే చచ్చావా? ముసలి పీనుగా. ఇదేం బుద్ధి నీకు!"

ఒళ్లంతా చెమటలు పట్టగా, బట్టతల నిమురుకుంటూ, నాకు డబ్బు లార్జించి పెడతున్న మహలక్ష్మివి నువ్వు. కోపమొస్తే నా పీకపిసికి చంపు. కాని నామీద అలాంటి అనుమానం పెట్టుకోకు. నాకు కళ్లు కూడా సరిగా కనిపించవు. నిన్ను అలా చూడాలనే కోరికా నాకు లేదు. కాటికి కాళ్లు చాచుకున్న

వాణ్ణి. నామీద దయతల్చు). నీ తండ్రిలాంటి వాణ్ణి. చావు భయంతో ఇక్కడ దూరాను తల్లీ. నా శత్రువు ప్రిండిన్ ప్రేక్షకుల్లో కనిపించాడు. నేను కనిపిస్తే వాడు చంపకుండా వదిలిపెట్టడు. వాడికి నేను అయిదు వేల రూబుల్లు బాకీ వున్నాను."

"అయితే నాకేమిటి? తక్షణం యిక్కణ్ణుంచి వెళ్లిపో, నీచుడా. గెటవుట్."

"నీ కాళ్లు పట్టుకుంటాను. కనికరం చూపించు తల్లీ. ఈ మొత్తం హాల్లో వాడు రాలేని చోటు ఇదొక్కటే. హీరోయిన్ డ్రెస్సింగ్ రూంలో నేనుండగలనని వాడూహించలేడు. స్టేజీ అరేంజ్‌మెంట్లు చూస్తున్నప్పుడు కనిపించాడు. నన్ను చూశాడంటే వదిలిపెట్టడు."

"దరిద్రుడా. వేషం విప్పినప్పుడు నన్ను చూశావు."

"లేదు తల్లీ. భయంతో వణికి ఛస్తున్నాను. నేనిక్కడ దాక్కున్నది ఆ ఉద్దేశ్యంతో కానే కాదు. ప్రాణభయం తల్లీ. ఆ మధ్యనొకసారి నేను కనిపిస్తే చితకబొడిచి, త్వరలో డబ్బివ్వకపోతే నడిరోడ్డుమీద ఖూనీ చేస్తానన్నాడు."

"ఈ ఆడంగి కబుర్లన్నీ చెబుతూ ఇక్కడే వున్నావు నీచుడా. వెళ్లు. లేదా అరుస్తాను. ఇక్కడున్నావని తెలిస్తే జనం ఎట్టాగూ నీ కాళ్లూ, చేతులూ విరిచేస్తారు."

"నువ్వేమన్నా చేసుకో. నా ప్రాణాలు నీ చేతిలో వున్నాయి. నీ రెమ్యూనరేషన్ యాభై రూబుల్లు పెంచుతాను. సరేనా?"

"థూ" అంటూ హీరోయిన్ డ్రెస్సు తీసుకొని బయటకి పారిపోబోయింది.

"రక్షించు తల్లీ" అంటూ ఇండియూకోవ్ ఆమె కాళ్లు పట్టుకొని వదలడు.

"పోనీ, డెబ్బై అయిదు. ఈనాటి కలెక్షన్‌లో సగం నీదే."

"అబద్ధాల కోర్, ఇప్పుడెన్ని మాటలన్నా చెబుతావ్."

"దేవునిమీదొట్టు. మాట తప్పితే నేను మశూచి వచ్చి చస్తాను".

"నీలాంటి వెధవల్ని నమ్మకూడదు".

"కావాలంటే రాసిస్తాను. ప్రతి షోకి డెబ్బై అయిదు రూబుల్లు పెంపు ప్లస్ ఈనాటి కలెక్షన్‌లో సగం. నా భార్యమీద, నా పిల్లల మీద ఒట్టు."

"సరే. చూస్తానుగా. మొదట సోఫా కిందికెళ్లు." ఇండి యూకోవ్ మళ్లీ సోఫాకింద నక్కాడు.

హీరోయిన్ వేషం సరిచూసుకుంది. తనమీద తనకే సిగ్గుగా, అసహ్యంగా వుంది. ఓ పరాయి మగవాడు తనను నగ్నంగా చూశాడు. నాటకం వెయ్యాలంటే వేషం మార్చుకోక తప్పదు మరి. ఇది కూడా సభకోసం చేసిన త్యాగమే. తనకు లాభం. వాడికి ప్రాణభిక్షే. ఇండి యూకోవ్ మీద కాసింత జాలి కూడా వేసింది.



ప్రదర్శన ముగిసింది. హాలంతా ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మార్మోగింది. బహుమతులు, పూలగుచ్ఛాలతో హీరోయిన్ను ముంచెత్తారు. అభినందన సంరంభం ముగిశాక ఇండి యూకోవ్ పల్లికలిస్తూ వచ్చాడు.

"చూశావూ, వాడు ప్రిండిన్ లాగే వున్నాడు. అదే పిల్లిగెడ్డం. అదే ముఖ కవళికలు. అదే ఒడ్డూ, పొడుగూ. కాని వాడు ప్రిండిన్ కాడు. హమ్మయ్య. బతికిపోయాను. అనవసరంగా నిన్ను కూడా హైరానా పెట్టాను."

"జరిగిందేదో జరిగిపోయిందిలే. నువ్వు చేసిన వాగ్దానాలు మాత్రం మరిచిపోకు."

"నేనేమీ మాట తప్పటం లేదు. కాని వాడు ప్రిండిన్ కాడే. వాడు ప్రిండిన్ అయినప్పుడే కదా మన అగ్రిమెంటు అమలు జరిగేది. ఏమంటావు. నో ప్రిండిన్. నో ప్రామిస్. నో అగ్రిమెంట్."

"అబద్ధం. మాటతప్పిన నీచుడా" అంది జరిగిన అవమానానికి, డబ్బులకూ ముడిపెట్టి సంతృప్తి పడిన హీరోయిన్.

"నేను మాట తప్పలేదు. ప్రిండిన్ వచ్చాడు. రక్షించమన్నాను. ప్రిండిన్ రానే రానప్పుడు నువ్వు నన్నెలా రక్షించావు? గాలిన పొయ్యే దానయ్య ఎవడో ప్రిండిన్ లాగా కనిపిస్తే నీకు డబ్బులిచ్చెయ్యాల్సిందేనా?"

ప్రాణభయం తొలగినందుకో, డబ్బులు మిగిలినందుకో ఇండియూకోవ్ పదే పదే పగలబడి నవ్వుకున్నాడు.

■



## ఆఫ్తాబ్ డ్రెస్సింగ్ రూమ్‌లో బిపాశ?

ఎవరు నేటి బాలీవుడ్ హాట్ ప్రాపర్టీ బిపాశా బసు. మునుపటి 'లేడీ కిల్లర్' పర్వీన్ బాబీనీ, మగాళ్లను చంపుకుతినే 'రేఖ'నూ, బిపాశ మించిపోయిం దంటున్నారు. ఆఫ్తాబ్‌తో బిపాశ రెండు సినిమాలు చేస్తున్నది. 'హంగామా' చిత్రం షూటింగులకు ఆఫ్తాబ్ త్వరగానే వచ్చినా బిపాశ కాస్త ఆలస్యంగా వచ్చి అతని మేకప్ రూంలోకి పోయింది. చూసేవారందరూ "ఇద్దరికీ ఒకటే మేకప్ రూం వుండదు కదా. ఇదేంటి చెప్మా?" అనుకున్నార్ట. బిపాశ తన చేత్తో ఒక డ్రెస్‌ను పట్టుకుని గాలిలో విలాసంగా ఊపుతూ. "మా ఇద్దరికీ ఒకే లాంటి డ్రెస్‌లు రెండున్నాయి. అవి చూసుకునేందుకు వెళ్లాను" అందిట హాయిగా. రేపు ఆఫ్తాబ్ బాత్ రూమ్‌లోకి వెళ్లొచ్చినా ఇంకో ఐడియా ఏదో తట్టకపోదీ అందగత్తెకు!